# అందగత్తె

పులిపాటి జగన్నాథరావు

నిజం చెప్పాలంటే తల్లి గుండె కన్న కడుపును చూడగానే వేగంగా కొట్టుకున్నా. సహజంగా తనకే తెలీకుండా పుట్టుకొచ్చి భయంతో ఏదో బొత్తిగా అర్థం కానట్లు ఒక్క క్షణం చూసి కూతుర్ని దగ్గరికి తీసుకుంది తల్లి. అదృష్టవశాత్తూ ఈ ఆడపిల్ల ధనధాన్యాలూ, గౌరవమర్యాదలు గల ఇంట్లో పుట్టింది గాని, అలా కాక బీద ఇంట్లో పుడితే తల్లిదండ్రులు ఎన్ని ఇక్కట్లకు గురయ్యేవారోనని ఆ బిడ్డను చూసిన పెద్దలంతా ముక్కుమీద వేలేసుకున్నారు.

మాటవరుసకు ఈ పుట్టిన బిడ్డను "అందగత్తె" అనే పేరుతో పిలిచి వ్యవహరిస్తాను. వయసు రాకమునుపే అందగత్తె తన తల్లిదండ్రుల సమక్షానికి దప్పితే మఱెవరి కంటా పడటానికి పూర్తిగా వెరిచేది. దేనికంటే ఆడా, మొగా పిన్నా, పెద్దా భేదం లేకుండా, అంతా ఆ అమ్మాయి దృష్టిలో పడితే కన్నార్పక అదేపనిగా ఆ అమ్మాయి కనుచూపుమేరలో ఉన్నంతవరకూ చూసేవారు. మరి తల్లితండ్రుల్ని తప్పితే మరెవ్వరినీ చూడక వయసు వచ్చేవరకూ అందగత్తె తల్లి నేర్పిన నాట్యంతోను, తండ్రి నేర్పిన చదువుసంధ్యలతోను, సహజంగా పుట్టుకతో వచ్చిన సంగీతంతోను ఒంటరిగా కాలక్షేపం చేసిందన్నానూ, కూతురికి దృష్టి తగిలిందేమోనని నిత్యం తల్లితండ్రులు వెరిచేవారన్నానూ ఆశ్చర్యం ఏముంది!

చాలా పీనాసిగా తగ్గించి చెప్పాలంటే లోకమంతా అందగత్తెను గూర్చి బహిరంగంగా ఇలా చెప్పుకునేవారు: 1. ఆ అమ్మాయిని చిదిపి దీపం పెట్టవచ్చు. 2. మంచుకంటె తెల్లగాను, పువ్వుకంటె మృదువుగాను, చెఱుకుకంటె తియ్యగాను చూపులకే ఆ అమ్మాయి ఉంది. ౩. ఆ అమ్మాయిని కన్న తల్లి తన తపస్సంతా ధారపోసే కన్నదేమో! 4. ఆ అమ్మాయి నుదుటినీ, ఎంతో వశీకరణశక్తి నిగూఢంగా గల కనురెప్పల్నీ, చూపులనే కెంపులకంటె విలువైనవిగాను, తియ్యగాను ఉన్న పెదవుల్నీ చూస్తున్న ఫలితానికి, కష్టంగా లతా, తీగ, చెట్టూ చేమలతో కూడిన సాధు ప్రకృతి అంతా — పరోపకారానికి పేరుబడేసింది గనుక — నిత్యం, ప్రతి రోజూ, బంగారం విలువ గల పూదండల్ని గుచ్చాలి. ౫. అమాయకమైన ఆ అమ్మాయి సుకుమారతకు మృదువైన పూవుకు ముళ్ళై, ముళ్ళులై పోవచ్చు — అవి ఆ అమ్మాయి జడలోనూ, నిద్రించే చోటా ఉండగా.

అసలు పలుకుల్ని అర్థం చేసుకునే పాపిడి వచ్చినప్పుడే తనను చూడటానికి తన తల్లిదండ్రులు తప్ప పరాయివాళ్ళంతా వేసే పాచికలకు అవ్యక్తంగానే అందగత్తె చాలా సిగ్గుపడేది. నిజంగా ఆ అమ్మాయి ముఖంమీద సిగ్గు ఎంత అందంగా ఉంటుందో ఒక్క ఆ అమ్మాయి తల్లికే తెలీటం ఎంతో అదృష్టంతో కూడిన విషయం. దేనికంటే ఈ విషయం తెలిస్తే లోకమంతా ఎంత అసహనాన్నీ, విచారాన్నీ పొందేదో — ఆ అమ్మాయి ముఖం లజ్జతో, గులాబీరంగుతో, రమణీయంగా ఉన్నప్పుడు కాకపోగా, సాధారణంగానైనా చూడనందుకు.

ఇక అందగత్తె పెళ్ళి ప్రసక్తిని తెచ్చి దాన్ని గురించి చెప్పమంటే మాత్రం నా మనస్సు చాలా కష్టపడుతుంది. మొట్టమొదట అందగత్తె పాదాల కోసం అనేకులు అనేకవిధాల ప్రాధేయపడ్డారు. ఇంతెందుకు? అంతా ఒక స్వయంవరంలాగా జరిగింది. ఒక విషయం మాత్రం అందగత్తెను పెళ్ళాడుదామని వచ్చినవారందరికీ తెలుసు. అదేమిటంటే అందగత్తె తమలో ఎవ్వరిని చేపట్టినా ఆ వ్యక్తి ఓ ఐదారు ఘడియలకంటె ఈ భూమ్మీద గాలిపీల్చలేడని, మరి అందం అంత అసూయనూ, ఓర్వలేనితనాన్నీ, అసహనాన్నీ రేకెత్తించగలదు! కాని అమిత [illegible]ంగా ఆ అమ్మాయిని పెళ్ళాడుదామని వచ్చి చూసినవారంతా నిజంగా ఆ అమ్మాయిమీద ఎంతో జాలికలవారు. కనుకనే అందగత్తెను దగ్గరగా చూసినందుకే ఎంతో అనంతమైన ఆనందాన్నీ, సంతృప్తినీ పొంది తిరిగి వెళ్ళిపోగలిగారు! అందగత్తె 'మ[illegible]'ని కోరినవారంతా ఈ విషయాన్ని సహజంగా ఇట్టే గమనించి

ఆ అమ్మాయి భావి సౌభాగ్యానికీ, సుశీలానికీ వెయ్యిదేవుళ్లను మొక్కుకున్నారు.

వసంతకాలం వచ్చింది. అందగత్తెను చక్కదనాల పటుత్వం గల యవ్వనంకూడా వచ్చింది. ఓ నాటి వెన్నెలరాత్రి తన స్నానాలగదిలో అందగత్తె నిగనిగ మెరిసిపోతున్న తన నగ్నశరీరం అంతా తనే ముగ్ధురాలై మోహంతో కోరికగా చూసుకుంది. ఆ తరువాత తన పెదవులనే, తన నుదుటినే, తన కేశాలనే తను గట్టిగా ముద్దుపెట్టుకుందామనుకుంది. కాని ఆ తలంపు గొంతెమ్మకోరిక ఐ ఫలించలేదు. అప్పుడు ఎన్నడూ కంట తడి ఎరుగని అందగత్తె కాటుక కనుకొలకుల్లోంచి ముత్యాల్లాంటి కన్నీటిచుక్కలు రాలినై — ఆమె కోసమే! తన వక్షాన్ని గట్టిగా ముద్దుపెట్టుకుందామనే ప్రయత్నంలో ఆమె తన రక్తాన్నే చూసుకుంది, పిచ్చిగా, నగ్నంగా, ఏకాంతంగా, అరం లేకుండా తన స్నానాలగదిలో అందగత్తె తన శక్తి అంతటితో, ఆ తరువాత చేసిన నాట్యానికి చుట్టూ ఉన్న గాలే తాను నివ్వెరపోయినట్లు నిశ్శబ్దంగాను, నిశ్చలంగాను అయింది. ఇంతలో బయటి గాలి రివ్వున శబ్దం చేసుకుంటూ బలంగా, శక్తివంతంగా ఎవరో గదితలుపుల్ని తట్టినట్టు అందగత్తెను స్ఫురింపచేసింది. తనేదో తప్పుచేసినట్టు తన పవిత్రత తెలియచెప్పగా, తన తల్లి తలుపులు తట్టిందేమోనని, ఆ తత్తరపాటులో చైతన్యాన్ని గోల్పోతూ, అందగత్తె వజ్రాలతో చేయబడ్డ తన చేతి ఉంగరాన్ని కొరికింది. అందగత్తె ఆత్మ ఆమె శరీరంలో లేదు — ఆమెతల్లి ఆమెకోసం మనస్సు ప్రేరేపణవల్ల వచ్చినప్పుడే.

మర్నాడు అందగత్తె మరణించిందనే వార్త విన్నప్పుడు ఆమె సౌభాగ్యాన్ని, సుశీలాన్నీ కోరినవారంతా తమ వేదనలోనూ, దుఃఖంలోనూకూడా ఈ ఒక విషయాన్ని విస్మరించలేకపోయారు. అదేమిటంటే, ఏదైనా — అమాయికమైన చక్కదనమైనా, మంచితనమైనా — ఇలాంటిది మరేదయినా "అతి" ఐతే ప్రమాదకరమనీ, శుభదాయకం కాదనీ.


రీటా

తలవెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగని గాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తలవెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనవేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును.

వెల సీసా 15 అణాలు



RITA

HAIR TONIC